



కలెక్టర్ కాళ్లపై పడిన జలీల్ అహ్మద్‌ను చేయిపట్టి లేపుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రుణపడి ఉంటాం..

మా స్కూలు తరలించొద్దు..

కన్నీరుమున్నీరైన నార్త్ గిరిజన కాలనీవాసులు

సానుకూలంగా స్పందించిన కలెక్టర్, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కోట

గూడూరులో శనివారం జరిగిన 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో మనసును కదిలించే ఓ సంఘటన చోటు చేసుకుంది. తిరుపతిజిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్,సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ లు హాజరైన ఈ కార్యక్రమానికి కోట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ పాల్గొన్నారు. కోట పంచాయతీ పరిధిలోని నార్త్ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాలను 3,4,5 తరగతి విద్యార్థులను 2 కిలోమీటర్ల దూరంలోని జరుగుమల్లి పాఠశాలలో విలీనం చేయడంపై అభ్యంతరాలను కలెక్టర్ కు వివరించి, ఒప్పించే క్రమంలో ఒక్కసారిగా కలెక్టర్ పాదాల మీద షేక్ జలీల్ అహ్మద్ పడడం ఆశ్చర్యానికి గురిచేసింది. కోట మండలం నార్త్ గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను జరుగుమల్లి పాఠశాలకు తరలిస్తే డ్రాపవుట్స్ అమాంతం పెరిగి అక్షరాస్యతా శాతం పడిపోయే అవకాశం ఉందని కలెక్టర్ కు వివరించారు. ఆదర్శ పాఠశాల విద్యా విధానం అమలు సదుద్దేశ్యమైనప్పటికీ గిరిజన విద్యార్థుల తల్లితండ్రులు సదరు పాఠశాలకు పంపడానికి అనాసక్తిగా ఉన్న నేపథ్యంలో విద్యార్థుల తల్లితండ్రులు తరపున ప్రతినిధిగా సమస్యను తెలియజేస్తున్నానని తెలిపారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని జలీల్ అహ్మద్ తెలిపారు. కలెక్టర్ కాళ్ల మీద పడి ప్రాధేయపడిన జలీల్ అహ్మద్ కృషిని వారు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు.మోహన్ రెడ్డి,దారా సురేష్,ఎమ్.శ్రీధర్ రెడ్డి బాషు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్ పేరిట చంద్రబాబు సర్కార్ అమలు చేస్తున్న ప్రభుత్వ బడుల విలీన ప్రక్రియపై క్షేత్రస్థాయిలో సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఊరి బడికి తమ పిల్లల్ని దూరం చేసే ఈ ప్రక్రియను ఎంత మాత్రమూ ఒప్పుకోమని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేయడంతో పాటు ఊరి బడికి ఉరి వేసేలా గత జగన్ ప్రభుత్వం అమలు చేసిన జీవో నెం.117ను చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే దానిని తలదన్నేలా మోడల్ స్కూల్స్ పేరిట 3,4,5 తరగతులను, 6,7,8 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేస్తూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను మూతపడేటట్లు చేస్తోంది. శాసన మండలిలో జీవో నెం.117, 128లకు వ్యతిరేకంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తీర్మానాలు ప్రవేశ పెట్టినా చంద్రబాబు సర్కార్ ముందుకే వెళ్తుండడంతో తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు 900 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు మూత బడికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంది.

విలీనంపై పెరుగుతున్న వ్యతిరేకత


ఏకపక్ష తీర్మానాలకు ఎంఈవోల ఒత్తిడి



'ఊరి' బడికి 'ఉరి'



తమ పిల్లలకు చదువు దూరం చేయొద్దని తీర్మానం చేసి వినతిపత్రం ఇస్తున్న తల్లిదండ్రుల కమిటీలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం లోపల ప్రభుత్వం బడుల విలీన ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది. ఆ మేరకు దూకుడును పెంచింది. విలీన ప్రక్రియ కార్యక్రమ బాధ్యతను ఎంఈఓలు ప్రధానోపాధ్యాయులపై పెట్టారు. ఏమైనా చేసుకోండి.. బుజ్జగించండి.. బ్రతిమలాడండి.. అంతిమంగా తల్లిదండ్రులను ఒప్పించి విలీనానికి అనుకూలంగా తీర్మానాలు చేసి పంపాలంటూ ఎంఈఓలు హుకుం జారీ చేస్తున్న పరిస్థితి. ఆ మేరకు జిల్లా పరిధిలో విలీన ప్రక్రియ జాబితాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధిత ఎంఈఓల నుంచి ఎస్ఎంసి తీర్మాన ప్రతులు వెళ్లడం గమనార్హం.

ఎస్సీ, ఎస్టీలు చదువుకు దూరం

చంద్రబాబు సర్కారు అమలు చేస్తున్న పాఠశాలల విలీన ప్రక్రియ కారణంగా ఎస్సీ, ఎస్టీలు చదువుకు దూరం కానున్నారు. గిరిజన కాలనీలు, దళిత వాడలు ఊరికి దూరంగా ఉండే నేపథ్యంలో ఎక్కడో ఉన్న ఉన్నత పాఠశాలలకు పేద పిల్లలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అత్యధిక శాతం ఎస్సీ, ఎస్టీలే ఉన్న నేపథ్యంలో విలీన ప్రక్రియ కారణంగా వారంతా ఉన్నత చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు ఎస్ఎంసి కమిటీ సమావేశాలు సందర్భంగా పాఠశాల విలీన ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఊరి బడికి ఉరేయాలని చూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేస్తున్నారు. అలాకాదని ముందుకెళ్తామంటే పిల్లల్ని బడికి కూడా పంపమని హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులకు స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల నుంచి మద్దతు లభిస్తుండడంతో విలీన ప్రక్రియకు వ్యతిరేకంగా ఎంఈఓ కార్యాలయాలకు తీర్మానాలు వెళుతుండడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే తొట్టంబేడు మండలంలోని లింగమనాయుడుపల్లి ఎంపీయుపి స్కూల్ విద్యార్థులను గురుకులపాలెం ఎంపీపీ స్కూల్లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎంసి కమిటీ సభ్యులు తీర్మానించారు. అదేవిధంగా శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎర్రగుడిపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులను నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉత్సవాలు ఉన్నత పాఠశాలలో విలీనం చేస్తే తమ పిల్లల్ని బడికి పంపమంటూ శనివారం తల్లిదండ్రులు ఎంఈఓ భువనేశ్వరికి వినతిపత్రం అందించారు. అదేవిధంగా బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో కాటూరు తదితర గ్రామాల్లో పాఠశాలల విలీన ప్రక్రియకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల విలీనానికి వ్యతిరేకంగా ప్రక్రియపై ఇప్పటికే ప్రజా సంఘాల ఐక్యవేదిక పోరు బాట పట్టిన నేపథ్యంలో చంద్రబాబు సర్కారు ముందుకే వెళ్తుందా, లేకుంటే వెనక్కి తగ్గుతుందా చూడాలి మరి.

తిరుమల సిఆర్ఓ పునర్వ్యవస్థీకరణపై సమీక్ష

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా కేంద్రీయ విచారణ కార్యాలయంలో మెరుగైన వసతులు కల్పించేందుకు టీటీడీ ఈవో జె.శ్యామల రావు, అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శనివారం తిరుమలలోని అన్నమయ్య భవన్ లో కేంద్రీయ విచారణ కార్యాలయం పునర్వ్యవస్థీకరణపై సమీక్ష నిర్వహించారు. తిరుమలలోని కేంద్రీయ విచారణ కార్యాలయం భక్తులకు వసతి, దర్శన టికెట్లు, ఇతర అవసరమైన సేవలను అందించే ప్రధాన కేంద్రంగా పనిచేస్తుంది. అయితే గత కొంత కాలంగా, ముఖ్యంగా రద్దీ సమయంలో సీఆర్వోకు అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తుతున్నారు. ఈ భవనాన్ని చాలా దశాబ్దాల క్రితం నిర్మించడంతో రోజురోజుకీ పెరిగిపోతున్న భక్తుల సంఖ్యత తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు, విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌కు చెందిన ఆర్కిటెక్ట్, అర్బన్ డిజైనర్ డాక్టర్ జి.కార్తీక్ పవర్ పాయింట్



ప్రజెంటేషన్ రూపొందించి సమగ్ర పునర్వ్యవస్థీకరణ ప్రణాళికను టీటీడీ అధికారులకు వివరించారు.

ఈ ప్రజెంటేషన్‌లో భక్తుల రాకపోకలను సులభతరం చేయడం, స్థల వినియోగాన్ని సమర్థవంతంగా చేసుకోవడం, సిఆర్వో, పీఏసీ-1 ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై లోతైన అధ్యయనం చేసి పలు ప్రతిపాదనలను వెల్లడించారు. ఈ పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక తిరుమల ఏడుకొండల ఆధ్యాత్మిక మహత్యాన్ని, పర్యావరణానికి అనుగుణమైన నగర ప్రణాళికా సూత్రాలను సమన్వయం చేస్తూ రూపొందించబడింది. ఈ సందర్భంగా ఈఓ శ్యామలరావు మాట్లాడుతూ ప్రత్యేక క్యూ లైన్లు, భక్తులు వేచి ఉండే ప్రాంతాలు, ప్రస్తుత భవనాల పునరుద్ధరణ వంటి అంశాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. ఈ ప్రణాళిక టీటీడీ దీర్ఘకాలిక మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా కూడా ఉండాలని సూచించారు. ప్రస్తుత రద్దీ పరిస్థితులను చక్కదిద్దడం , కొన్ని దశాబ్దాలుగా ఉన్న భవనాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం, అలాగే వచ్చే కొన్ని దశాబ్దాల అవసరాలను దష్టిలో ఉంచుకోవడం ఈ ప్రణాళిక యొక్క ముఖ్య ఉద్దేశమని ఈఓ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీటీడీ చీఫ్ ఇంజినీర్ సత్యనారాయణ, టీటీడీ పట్టణ ప్రణాళిక- డిజైన్ నిపుణులు రాముడు, తిరుమల ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

21న 'పిజిఆర్ఎస్'కు తరలిరావాలని పిలుపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ముస్లీంల మనోభావాలకు వ్యతిరేకరంగా కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని తీసుకురావడం, బోర్డులో హిందువులను సభ్యులుగా చేర్చడం అన్యాయమని వక్తలు ఉద్ఘాటించారు. ఈనెల 21వ తేదీన తిరుపతి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో శాంతియుతంగా వినతి పత్రం ఇవ్వడానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈఎస్ఐ ఆస్పత్రి సమీపంలో ఉన్న ముస్లీం షాదీ మహల్ సమీపంలోని అబూబకర్ మసీదులో రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ముస్లీం మతపెద్ద మహ్మద్ ఇషాక్ అధ్యక్షత వహించారు. నగరంలోని అన్ని మసీదుల్లో ఉన్న మతవల్లీలు, మసీదు పెద్దలు, ముస్లీం సంఘాల నేతలు, సిపిఎం, ఆర్‌పిఐ, కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్, ఐఎఫ్‌టియు నేతలు హాజరయ్యారు. లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ పి.అంజయ్య,



ముస్లీం మత పెద్ద షఫీ అహ్మద్ ఖాదరి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజల మధ్య విభజించు పాలించు అనేలా ఈ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. సుప్రీం సైతం సవరణ చట్టంలోని లోపాల్ని ప్రశ్నించిందన్నారు. ఇప్పటికే బిజెపి పాలిత రాష్ట్రాల్లో వక్ఫ్ భూములను ముందుగానే తీసుకోడానికి ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. హిందువులను బోర్డులో తీసుకోవడం వల్ల ముస్లీంలకు ఎలాంటి న్యాయం జరగదన్నారు. హిందువుల బోర్డుల్లో ముస్లీంలను సభ్యులుగా చేర్చుతారా అని ప్రశ్నించారు. ముస్లీంలు అందరూ ఐక్యంగా ఉండి చట్టం రద్దయ్యేవరకూ ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, ఐఎఫ్‌టియు నాయకులు వెంకటరత్నం, కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి మాట్లాడుతూ వక్ఫ్ చట్టంతో బిజెపి లబ్ధి పొందేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఈ భూములను బలవంతంగా లాక్కుని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. మేలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో సదస్సు జరపాలని తీర్మానించారు. కన్వీనర్‌గా పి.అంజయ్యను ఎన్నుకున్నారు. ఈ సదస్సులో ముస్లింల మత పెద్దలు మొహమ్మద్ ఇషాక్, ఏటీకే మాలిక్, ఖాసిం సాహెబ్, ఇమ్రాన్ భాష, రఫీ హిందుస్తానీ జాఫర్ పులి, సిపిఐ జిల్లా నాయకులు మురళి, పెంచలయ్య పాల్గొన్నారు

జేఈఈ ఫలితాలలో 'శ్రీ చైతన్య' ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శనివారం విడుదలైన జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించారని తిరుపతి జోన్ ఏజీఎం బీవీ ప్రసాద్ తెలిపారు. తిరుపతి జోన్ కు చెందిన పి.కష్ణ వంశీ 331, ఇ.జశ్వంతి 458, సి. ద్వారక్ 723, యం.జి.సూర్య 818, బి.ఏ. రెడ్డి1000, బి. అన్విత్ 1214, మునికష్ణ 1329, సి. సహస్ర 1742, కె. అభిరామ్ 1885, కె. సతీష్ 1968, ఒ.మోక్షిత్ 2622, సి.వరుణ్ తేజ 3642, కె.మంజునాథ మహర్షి 5001, వి. నిఖిలేశ్వర్ రెడ్డి 5268, యం.హర్షిణి 5315 యు. హర్షిత బ్రైటి 5361, యు. ఉజ్వల్ సాయి రెడ్డి 5527 అత్యుత్తమ ర్యాంకులను సాధించారని, పదివేల లోపు ర్యాంకులు 26 మంది, ఇరవై వేల లోపు ర్యాంకులు 46 మంది సాధించడంతో పాటు దాదాపుగా 85 మంది విద్యార్థుల వరకు జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైనటువంటి ఎన్ఐటి, ఐఐఐటిలలో సీట్లు సాధించగలిగే ర్యాంకులు పొందారన్నారు. అలాగే మే 18న జరగబోవు జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు సుమారుగా 450 మంది అర్హత సాదించారన్నారు. ఈ



సందర్భంగా అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, ఇందుకు కారణమైన అధ్యాపక బందాన్ని డెరెక్టర్లు సుష్మశ్రీ, నాగేంద్రకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో డీన్లు కే ఎల్ జి ప్రసాద్, రామమోహనరావు, శ్రీనివాసరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

'జెఈఈ మెయిన్స్'లో నారాయణ ప్రభంజనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

గురువారం అర్ధరాత్రి విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని నారాయణ విద్యాసంస్థల డిజియం కొండలరావు తెలిపారు. ఓపెన్ క్యాటగిరిలో ఎం.భానుచరణ్ రెడ్డి 158, మణిదీప్ రెడ్డి 274, నిఖిల్ 386, ధనుష్ 466 (ఓబిసి-66), హిమేష్ రాఘవ చంద్ర 502(ఓబిసి-70), కార్తీక్ శ్రీ 1072, యశ్విత 1535, బాలాజీ సాయిచరణ్ 1654, గగనాదిత్య రెడ్డి 2126 వంటి అత్యుత్తమ ర్యాంకులతో పాటు మొదటి 1000 లో 6, రెండువేలలో 8, ఐదువేలలో 14, పదివేలలో 24, ఇరవై వేల లో 39, 30 వేలలో 56 ర్యాంకులు ఒక్క ఓపెన్ కేటగిరీలోనే సాధించారన్నారు. రికార్డు స్థాయిలో 500 మందికి పైగా విద్యార్థులు అడ్వాన్సుడ్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ సురేష్ , ఐఐటి ఫ్యాకల్టీ విజయకుమార్, అభిషేక్, చిట్టిబాబు, దుర్గాప్రసాద్, ఎ.జి.యం గోపీచంద్ అభినందించారు.







తిరుపతి, తిరుమలలో పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులు సేకరణ

'ఈ -వేస్ట్' సేకరణతో 'స్వర్ణాంధ్ర'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, తిరుమల, యంత్రాంగం

ప్రమాదకరమైన ఎలక్ట్రానిక్ వేస్ట్‌ను తమకు అందజేసి, నగర శుభ్రతకు సహకరించాలని కమిషనర్ ఎన్.మూర్య అన్నారు. స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం ఈ వేస్ట్ సేకరణ, నిర్వహణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి శ్రీదేవి కాంప్లెక్స్ వరకూ ర్యాలీ సాగింది. శాఫ్ ఛైర్మన్ రవినాయుడు, యాదవ కార్పొరేషన్ అధ్యక్షులు నరసింహయాదవ్, ఎపిఎంఐడిసి డైరెక్టర్ విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, ఆర్‌సి మునికృష్ణ, కార్పొరేటర్ నారాయణ ర్యాలీని ప్రారంభించి పాల్గొన్నారు. శ్రీదేవి కాంప్లెక్స్ వద్ద ఈ వేస్ట్ సేకరణ నిర్వహించారు. జనవరిలో పరిసరాల పరిశుభ్రత, ఫిబ్రవరిలో వేర్వేరుగా చెత్తసేకరణ, మార్చిలో ప్లాస్టిక్ నియంత్రణ థీమ్‌తో అవగాహన కల్పించామన్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను న్యూ బాలాజీ కాలనీలోని అన్నా క్యాంటీన్ సమీపంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అమరరాజా కంపెనీలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ ఎన్.మౌర్య, సీనియర్ ఇంజినీర్ మురళి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నరసింహులు నాయుడు, సంస్థ ఈఈ రాజశేఖర్ పాల్గొన్నారు. ప్రకాశం మున్సిపల్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోరీజినల్ కౌన్సిలర్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పరిసరాలను శు భ్రం చేశారు. 100 మంది వాకర్స్ కమిటీ సభ్యులకు రాయలసీమ ఎంటర్ప్రైసెస్ వెంకటేశ్వర్లు టీషర్ట్ వితరణ చేసారు.

వాహనాలనుంచి చెత్తను బయటకు విసరొద్దు : సిహెచ్ వెంకయ్యచౌదరి

పవిత్ర క్షేత్రమైన తిరుమలలో భక్తులు తాము ప్రయాణం చేసే వాహనాల నుంచి రోడ్లపై చెత్తను విసరడం మానుకోవాలని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి విజ్ఞప్తి చేశారు. మొదటి ఘాట్‌రోడ్డులోని కుంకాల పాయింట్ వద్ద సిబ్బందితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో రాజేంద్ర, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఎఎస్టీఎఫ్) కార్యాలయం ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ-వ్యర్థాలు, చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌పి శ్రీనివాస్, ఆర్ఐ సాయిగిరిధర్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో.. ఎంఎల్ఎ బొజ్జల సుధీర్‌రెడ్డి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యర్థాల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు.

'అంబా' అని అరచినా...

ఆలకించని పొలిటి 'కిల్'

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. నిత్యం దేశ విదేశాల నుంచి వేలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. అందరి చూపు ఈ క్షేత్రంపై ఉంటుంది. అందుకే ఇక్కడ ఏమి జరిగిన తక్కువ సమయంలో విశ్వవ్యాప్తం అవుతుంది. దీన్ని బూర్జువా రాజకీయ పార్టీలు ఆసరగా తీసుకున్నాయి. గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకు తెస్తుంటారు. అందులో బాగమే ఇటీవల చోటు చేసుకున్న గోవుల గోల. భక్తుల మనోభావాలను పక్కన పెట్టి, వారి వారి ఇగోల గోస.. గోవులను అడ్డుపెట్టుకుని గోలగోల చేయడం గమనార్హం.

టిటిడి ఆద్వర్యంలో తిరుపతి తుమ్మలగుంట వద్ద ఎస్‌వి గోశాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ భక్తులు శ్రీవారికి కానుకగాఇచ్చే గోవులతో పాటు కొన్ని అరుదైన రకాల గోవులను పెంచి, వాటి ఉత్పత్తులను శ్రీవారి అభిషేకాలు, ప్రసాదాలకు వినియోగిస్తుంటారు. వందల సంఖ్యలో ఇక్కడ గోవులు ఉంటాయి. ఇటీవల టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఎస్‌వి డైరీఫామ్‌లోని గోవులు అధిక సంఖ్యలో చనిపోయాయని మీడియా ముందు విమర్శలు చేశారు. దీనికి కూటమి నాయకులు స్పందించి వైసిపి హయాంలోనే అధికంగా ఆవులు చనిపోయాయని, నాసిరకం దాణా వాడారని రకరకాల విమర్శలు చేశారు. దీనికి కరుణాకర్‌రెడ్డి వీడియోతో సహా మీడియా ముందు ప్రదర్శించారు. ఈవో సైతం వైసిపిని నిందిస్తూ మీడియా సమావేశం నిర్వహించారు. ఏకంగా సిఎం చంద్రబాబు నాయుడే దీన్నిపై స్పందించి వైసిపిపై విమర్శలు చేసి, దీన్ని తిప్పికొట్టాలని మంత్రులకు, కూటమి ప్రజాప్రతినిధులకు సూచించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ స్పందించి, తాను తిరుపతి ఎస్‌వి డైరీ ఫామ్‌కు వస్తున్నానని, 17వ తేది ఉదయం 9 గంటలకు కరుణాకర్‌రెడ్డి కూడా అక్కడికి వచ్చి విమర్శలను నిరూపించాలని సవాల్ విసిరారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర డెయిరీ ఫామ్ లో గోవుల మరణాలపై వారం రోజులుగా విమర్శలు ప్రతి విమర్శలు రాజకీయ వాతావరణ వేడిగా ఉన్న నేపథ్యంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ చేసిన ప్రకటనపై సవాల్ గా స్వీకరించి కరుణాకర్ రెడ్డి గురువారం ఉదయం తిరుపతి ఎస్వీ డైరీ ఫామ్ కు తన అనుచరులతో కలిసి బయలుదేరారు. మరోవైపు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కూటమి ఎమ్మెల్యేలు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, బిజెపి నేత భాను ప్రకాష్ రెడ్డి, టిడిపి నేతలు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తదితర నేతలంతా కలిసి ఎస్ వ డైరీ ఫార్మ్ కు లక్ష్మీపురం సర్కిల్ నుండి పాదయాత్రగా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే ఈ నిర్ణయాన్ని మళ్లీ అర్ధరాత్రికి రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకంటే ముఖ్యంగా తిరుపతి అర్బన్ ఎస్పి హర్షవర్ధన్ రాజు ఇరు వర్గాల రాజకీయ పార్టీల పరిస్థితిని కట్టడి చేస్తూ.. ఎస్వీ డైరీ ఫార్మ్ లోపలకి భూమన కరుణాకర్ రెడ్డి వారి గన్మెన్, ఎంపీ గురుమూర్తి వారి గన్మెన్, అలాగే టిడిపి ఎమ్మెల్యేలను కూడా ఎక్కువమంది లేకుండా ఒకరిద్దరితో మాత్రమే ప్రవేశించి చూసి వెళ్లాలని ఆంక్షలు విధించారు. దీంతో భూమన కరుణాకర్ రెడ్డి తన ఇంటి వద్ద నుండి డైరీ ఫార్మ్ కు బయలుదేరగా పెద్ద ఎత్తున అనుచరులు ఉండడంతో పోలీసులు ఆయన గహం వద్దకు చేరుకొని బయటకు వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో భూమన కరుణాకర్ రెడ్డి పోలీసుల తీరుకు నిరసనగా తన ఇంటి వద్ద నేలపై పడుకొని నిరసనకు దిగారు. ఆయనకు మాజీ డిప్యూటి సిఎం నారాయణస్వామి, మాజీ మంత్రి ఆర్‌కె రోజా, ఎంపి గురుమూర్తి సంఘీభావం తెలిపారు. ఈ సంఘటనల నేపథ్యంలో గురువారం తిరుపతి నగరంలో ఒక విధంగా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఎట్టకేలకు పోలీసులు ఇరువర్గాలను అదుపు చేయడంతో భారీ స్థాయిలో గొడవలు జరగకుండా అప్పటికి సద్దుమణిగింది. మరణిస్తున్న గోవుల వ్యవహారాన్ని సున్నితంగా పరిష్కరించాల్సిన టిటిడి ఒక విధంగా పాలకమండలి, అధికారుల మధ్య సమన్వయ లోపంతో యధావిధి గానే ప్రతిపక్షాలకు ఆయుధాలను ఇచ్చినట్లు వ్యవహరించింది. గోవుల సహజ మరణాలపై ముందుగా ఒక ప్రణాళిక వాస్తవ సమాచారాన్ని ముందు ఉంచుకోకుండా ముఖ్యమంత్రి అసలు ఒక్క ఆవు చనిపోలేదు అనడం, టీటీడీ చైర్మన్ 24 ఆవులు చనిపోయాయి అనడం, ఈవో శ్యామలరావు ఏకంగా 42 ఆవులు చనిపోయాయని చెప్పడం, భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించిన విధంగా వంద గోవులు మూడు మాసాల్లో మరణించాయని ఆరోపించడం.. ఒక విధంగా టిటిడి ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా.. ప్రభుత్వానికి ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది. రెండు నెలల్లో 90కిపైగా గోవులు చనిపోయాయనికరుణాకర్‌రెడ్డి చెప్పారు. వాస్తవానికి ఆయన చెప్పిన సంఖ్యలో పది అటు ఇటు ఉన్నా.. ఆరోగ్య రిత్యా, వయస్సు మీరడం వల్ల గోవులు చనిపోవడం సహజం. దీన్ని ఒక ప్రకటన ద్వారా టిటిడి వాస్తవాలు వెల్లడిస్తే సరిపోయేది. అటు టిటిడి ఈవో స్థాయి అధికారి, పాలకమండలి, కూటమీ ప్రజాప్రతినిధులు, ఆఖరికి సిఎం కూడా దీన్ని ప్రతిష్టాత్మకంగా బావించి, ఇగో ఫీలింగ్‌తో వ్యవహరించడంతో గోటితో పోయేది గొడ్డలి వరకు వచ్చింది. ఇప్పటికైన ఆధ్యాత్మిక క్షేత్రం నిర్వహకులు సున్నిత అంశాలపై ఆచూతూచి వ్యవహరించి, భక్తులు మనోభావాలు కాపాడుతూ, ఆధ్మాత్మిక ప్రతిష్టను ఇనుమడింప చేయాలని పలువురు మేధావులు కోరుతున్నారు. గతంలో కల్తీ లడ్డూ వివాదాన్ని రగిల్చి రెండు మూడు నెలలు పొలిటికల్ గేమ్ ఆడారు. ప్రస్తుతం గోశాల్లో ఆవుల మరణాలు, దాణా అవకతవకలపై మాటల యుద్ధం జరుగుతోంది.

జెఈఈలో అమరావతి విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : జేఈఈ మెయిన్స్ ఫలితాలలో తిరుపతి అమరావతి ఐఐటీ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిభ చాటారని బివి కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ పార్థివ్ రెడ్డి తెలిపారు. ఎయిర్ బైపాస్ రోడ్ లోని ఆ కళాశాల వద్ద శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో తమ విద్యార్థి బి.అరుణకుమార్ రెడ్డి 82వ ర్యాంకు, వి.కేయుష్ సాయి 1072, టీ.వంశీ కృష్ణ 1748, సాయి సంతోష్ 3172, వై.మనీష్ 3852, ఎం. సాయి నిఖిత 4233, లకితా హాసిని 4467, లక్ష్మీ మాధురి 5192, రుతిక్ 5453, మానస్ కుమార్ 5569, నీరజ్ 5811, కార్తీక్ సాయి తేజ 5887, ఈశ్వర్ రెడ్డి 6144, లావ్య 6291, విజయ రామతీతి రెడ్డి 7247, రోహన్ తేజ 9615 ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారన్నారు. జాతీయస్థాయిలో 2500 లోపు మూడు, ఐదు వేల లోపు 7, పదివేల లోపు 16, 20 వేల లోపు 60 ర్యాంకులు సాధించారని, 75 మంది విద్యార్థులు 95% పైగా మార్కులు సాధించి ప్రతిభ చాటారని వెల్లడించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్పందనకు వందనం..

ఎస్టీ కాలనీకి తీరిన నీటి కష్టాలు



నీరు పట్టుకుంటున్న కాలనీ మహిళలు

ప్రజాశక్తి - బాలాయపల్లి : బాలాయపల్లి, పెరిమిడి పంచాయతీ, మేల్పూరు గ్రామ ఎస్టీ కాలనీ వాసుల నీటి కష్టాలపై ప్రజాశక్తిలో ప్రచురితమైన 'నీటికోసం.. కోటి కష్టాలు' కథనానాకి ఎట్టకేలకు అధికారులు, నాయకుల నుంచి స్పందన వచ్చింది. కాలనీలో ఇంటింటికీ కుళాయిని ఏర్పాటు చేసి సమస్యను తీర్చారు. దీంతో కాలనీవాసులు ప్రజాశక్తి యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

బార్ అసోసియేషన్ నిర్వహణ భేష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు బార్ అసోసియేషన్ సభ్యులు ఐకమత్యంగా ఉండి బాగా నడుపుతున్నారని జిల్లా జడ్జి రామచంద్రుడు పేర్కొన్నారు. శనివారం పుత్తూరు కోర్టు తనిఖీల్లో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పుత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పురుషోత్తం ఆధ్వర్యంలో జిల్లా జడ్జిని సన్మానించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి పెట్టి జడ్జిలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ జడ్జి జానకి, జూనియర్ సివిల్ జడ్జి గోపాల్ కృష్ణ, సీనియర్ న్యాయవాది గాలి రమేష్, బార్ అసోసియేషన్ నాయకులు శేషాచలం, మురళి రెడ్డి, సంజీవి, న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు 6వ తరగతి ప్రవేశానికి పరీక్ష

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల పరిధిలోని మావిళ్లపాడులోని ఆదర్శ పాఠశాలలో 6 వ తరగతి ప్రవేశానికి సోమవారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్, సిహెచ్.సుమలత తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరుకావాలని తెలిపారు. విద్యార్థులు 9 గంటలకల్లా పరీక్ష కేంద్రం వద్దకు రావాలన్నారు.

పల్లె నిద్రతో అవగాహన

ప్రజాశక్తి -దొరవారిసత్రం : రహదారులపై జరుగుతున్న ప్రమాదాలు, సైబర్ నేరాల గురించి శుక్రవారం రాత్రి మండల పరిధిలోని తల్లంపాడులో ఎస్పీ ఆదేశాల మెరకు, ఎస్ఐ అజయ్ కుమార్ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి, గ్రామస్తులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారులపై ద్విచక్ర వాహనాలపై వెళ్లే సమయంలో ప్రతి ఒక్కరూ హెల్మెట్ ఉపయోగించాలన్నారు. అదేవిధంగా సైబర్ నేరాలపై కూడా అవగాహన కలిగించారు. స్టార్ లాక్ గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై అజయ్ కుమార్ పల్లె పిల్లలకు విద్యా సామాగ్రి అందించారు.

స్విమ్స్ వైద్యసేవలు భేష్

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : స్విమ్స్ ఆధ్వర్యంలో శనివారం వరదయ్యపాలెం మండలం, గోవర్ధనపురం, సైన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ డా. మోహన్ ఆధ్వర్యంలో ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం, పింక్ బస్ ద్వారా ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్విమ్స్ సేవలను కొనియాడారు. స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.మునస్వామి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పింక్ బస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎవి.చైతన్య భాను, సైన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ మోహన్, తహసీల్దార్ రాజశేఖర్, స్థానిక నాయకులు పి.యుగంధర్ రెడ్డి, నిర్మల్ కుమార్, నరసరాజు, సి.రవిరెడ్డి, ఢిల్లీప్రసాద్, శీనప్పనాయుడు, యు.సురేష్ రెడ్డి, నందకిషోర్ రెడ్డి, హరినాయుడు, చిరంజీవి, నవాజ్, స్విమ్స్ కు చెందిన వివిధ విభాగాల వైద్యులు, పింక్ బస్సు సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, సైన్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయంలో సామాగ్రి చోరీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీ రోడ్డు మున్సిపల్ వార్డు సచివాలయంలో సామాగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన శనివారం వెలుగు చూసింది. ఈ నెల 17న సిబ్బంది విధులు ముగించుకొని సచివాలయానికి తాళాలు వేసి వెళ్లారు. మరుసటి రోజు సెలవు కావడంతో సిబ్బంది శనివారం వచ్చి చూడగా తాళాలు తీసి ఉండడంతో అనుమానంతో పరిశీలించారు. ప్రింటర్, ల్యామినేషన్ మిషిన్, యూపీఎస్ బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. కార్యదర్శి తస్లీం ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి




ప్రజాశక్తి - తిరుపతి సిటీ : రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి చేసి గాయపరిచిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధి, చింతల చేనులో రియల్ ఎస్టేట్ వ్యాపారి సురేష్ రెడ్డి, ప్రసాద్ అనేవ్యక్తి కి దుకాణంలో, ప్రసాద్ కత్తితో దాడి చేశాడు. కత్తిపోటులు గుచ్చి రక్త గాయాలతో ఉన్న సురేష్ రెడ్డిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. నిందితుడు ప్రసాద్ ఈస్ట్ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-కోట : కోట మండలం, వజ్జ వారి పాలెం ఎంపీపీ పాఠశాలను స్థానిక మండల విద్యాశాఖ అధికారి దారా మస్తానయ్య శనివారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం పెడుతున్న భోజన మెనూ అమలు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్, విద్యార్థులు ఉన్నారు.

పట్టపగలే రెచ్చిపోతున్న చైన్ స్నాచర్స్



> గతంలో కూడా ఇలాంటి చైన్ స్నాచింగ్‌లు జరిగాయి దొంగలను పట్టుకొని, అరెస్ట్ చేసి వస్తువులను రికవరీ చేసి బాధితులకు ఇవ్వడం జరిగింది. ఇప్పుడు కూడా జరుగుతున్న చోరీలపై నిఘాఉంచి వారిని పట్టుకుని తగు చర్యలు తీసుకుంటాం.
> - పుత్తూరు ఎస్ఐ ఓబులేష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలో చాలా చోట్ల పట్టపగలే చోరీలకు తెగబడుతున్నారు. వీధిలో వుండే మహిళలు, నడిచి వెళ్తున్న మహిళలపై చైన్ స్నాచర్స్ దృష్టిపెడుతున్నారు. మహిళలు చాకచక్యంతో నగల పట్టు పడకుండా కేకలు వేస్తూఉండడంతో దుండగులు పారిపోతున్నారు. అయితే పోలీస్ స్టేషన్ వరకు రాని సంఘటనలు అనేకం ఉన్నాయి. అందులో ద్రౌపది దేవి ఆలయం వద్ద బుధవారం మిట్ట మధ్యాహ్నం వెళుతున్న మహిళపై దుండగులు చైన్ లాగే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన ఆ మహిళ మెడలో చైన్ గట్టిగా పట్టుకుని కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న వ్యాపారస్తులు, పాదచారులు పరిగెత్తుకుంటూ రావడంతో దుండగులు పారిపోయారు. ఈ సంఘటన మరవక ముందే గురువారం మరో మహిళ నగలు కొనుగోలు కోసం డబ్బు తక్కువ పడడంతో పుత్తూరు పట్టణంలోని కాపీ వీధి, బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ నుంచి తిరిగి వెళుతుండగా దుండగులు దాడి చేశారు. ఆ మహిళ అప్రమత్తమై వారితో పెనుగులాడుతూ, కేకలు వేయగా, చుట్టుపక్కల వారు రావడంతో దుండగులు పారిపోయారు. ఈ పెనుగులాటలో చిన్న గాయాలైన మహిళను ప్రథమ చికిత్స కోసం స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పుత్తూరులో గతవారం రోజులు క్రితం గేట్ పుత్తూరులో ఓ మహిళ మీద దుండగులు చైన్ లాగేందుకు విఫల ప్రయత్నం చేశారు. ఇలాంటి చైన్ దొంగతనాలు పట్టణంలో తరచూ జరుగుతున్నా ఈ సంఘటనల్లో సుమారు 30 సంవత్సరాల లోపు యువకులు పాల్గొంటున్నారని స్థానిక మహిళలు తెలిపారు. ముఖానికి ఎలాంటి మాస్క్ కూడా లేకుండా బరితెగించి దోపిడీలు చేస్తూన్నారన్నారు. వరుస సంఘటనలు జరుగుతున్నా పోలీసులు చైన్ స్నాచర్స్‌ను పట్టుకోవడంలో ముందుకు వెళ్లలేకపోతున్నారు. ఇకనైనా పోలీసులు దుండగులను పట్టుకునే ప్రయత్నం చేస్తారని పట్టణ ప్రజలు భావిస్తున్నారు. అంతేకాకుండా పోలీస్ గస్తీ పెంచాలని కోరుతున్నారు.

అర్హులకు ఇంటి పట్టాలు ఇస్తాం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: శనివారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వరదయ్యపాలెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలలో సుడిగాలి పర్యటన చేసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనడంతో పాటు 39 రోజులుగా ఆందోళన చేస్తున్న ప్రజల సమస్యలు పరిష్కారానికి ఎమ్మెల్యే ఆదిమూలం చొరవ చూపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బుచ్చినాయుడు కండ్రిగ తహశీల్దారు కార్యాలయం వద్ద కనవనంబేడులో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని, తమకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరుతూ గత 39 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న వారిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆందోళనకారుల సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే వెంటనే తహశీల్దారు శ్రీదేవి తో చర్చించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంటి పట్టాలు పంపిణీ చేయడంతో పాటు ప్రభుత్వం ద్వారా పక్కా ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీ తో సంతృప్తి చెందిన ఆందోళనకారులు తమ దీక్ష విరమణకు అంగీకరించారు. వారికి మజ్జిగ అందించి దీక్షను విరమింప జేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనవాణికి 36 వినతులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : జనసేన జనవాణికి 36 వినతులు వచ్చాయి. శనివారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కార్యాలయంలో జరిగిన జనవాణిలో ప్రజలు తమ వినతులను అందించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అత్యవసర పనిపై వెళ్ళడంతో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ వినతలు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల్లో అత్యధికంగా మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి 19, నాలుగేసి చొప్పున రెవెన్యూ, విద్యుత్ శాఖకు చెందిన వినతులు వచ్చాయి. టిటిడికి సంబంధించి రెండు, పోలీస్ శాఖకు సంబంధించి మూడు, ఆర్టీసికి సంబంధించి ఒకటి, అలాగే మరో మూడు వినతులు అందాయి. ఈ వినతులను శాఖల వారీగా విభజించి ఆయా శాఖాధిపతులకు పంపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ అమరయ్య, డిఈ భవాని, విద్యుత్ శాఖ ఏఈ ఉమాపతి, జనసేన కార్పొరేటర్లు ఎస్ కే బాబు, దూది కుమారి, నగర అధ్యక్షులు రాజా రెడ్డి, ఆకేపాటి సుభాషిణి, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, బాబ్జీ, పొటుకూరి ఆనంద్, బాలసుబ్రమణ్యం అయ్యంగార్, రాజేష్ ఆచ్చారి, కెఎంకె లోకేష్, రమణారెడ్డి, సుబ్బారావు, ఆముదాల వెంకటేష్, మల్లిశెట్టి లక్ష్మీ, కోకిలా, తోట జయంతి, శిరీష, రాధా తదితరులు పాల్గొన్నారు.

టీడ్కో గృహాలకు రుణాలు పొందండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మునిసిపల్ కార్యాలయంలో టిడ్కో గృహాల బ్యాంక్ పాయింట్ పర్సన్స్‌తో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గతంలో టిడ్కో లోన్స్ మంజూరయి, రిజిస్ట్రేషన్స్ కాని, మార్ట్ గేజ్ పూర్తి కాని లబ్ధిదారులను పిలిపించించి మార్టిగేజ్‌లు పూర్తి చేయించాలని సూచించారు. రేజిష్ట్రషన్ పూర్తయిన లబ్ధిదారులకు బ్యాంక్ లోన్ ప్రాసెస్సింగ్ ప్రారంభించాలని తెలిపారు. అదేవిధంగా ఆర్.పి.లు మెప్మా ఆన్లైన్ అప్డేషన్స్ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.సి. ఓ రామ సుబ్బారావు , సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య, కమ్యూనిటీ ఆర్గనైజేర్లు చందన, లత, ఉష, అర్పిలు లక్ష్మి, సుజాత, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా వెంకటేష్

ప్రజాశక్తి - రామచంద్రపురం: రామచంద్రాపురం మండల వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా తిమ్మరాజు పల్లికి చెందిన నెల్లేపల్లి వెంకటేష్‌ను నియమించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నెల్లేపల్లి వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని, దళితుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వెంకటేష్‌కు మండల దళిత సంఘాల నాయకులు, వైసీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

ఎస్వీయూలో రేర్ ఎర్త్స్‌పై అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని స్థానిక శ్రీ వెకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఈ నెల 21 వ తేదీ నుంచీ అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఇంచార్జీ విసి ఆచార్య అప్పారావు వెల్లడించారు. " సైన్స్, టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ రేర్ ఎర్త్" అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించే ఈ అంతర్జాతీయ సదస్సు ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం, పద్మావతి యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం, న్యూఢిల్లీ రేర్ ఎర్త్ సైన్స్‌ల సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నాయి. ఈ కార్యక్రమంలో వర్సిటీ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి, ప్రొఫెసర్ ఆర్ పి విజయలక్ష్మి, డాక్టర్ ఎంఎల్పీ రెడ్డి, ప్రొఫెసర్ సి కె జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.

రోజా బుద్ధి మార్చుకో



రోజా దిష్టి బొమ్మ దగ్ధం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : వైసిపి మహిళా నేత, మాజీమంత్రి ఆర్కే రోజా బుద్ధి మార్చుకోవాలని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇంచార్జి కోటా వినుత హితవు పలికారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ఆయన కుమారుడు మార్క్ శంకర్‌ను ఉద్దేశించి రోజా పురుషంగా మాట్లాడిందంటూ జనసేన నేతలు శనివారం పట్టణంలో నిరసన తెలిపారు. రోజా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో కావలి శివకుమార్, చంద్రశేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో అశ్వమేధ విజయ దుందుభి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : జేఈఈ మెయిన్స్ ఫలితాలలో అశ్వమేధ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులతో విజయదుందభి మ్రోగించారని ఆ కళాశాల డైరెక్టర్లు అబ్దుల్ ఇష్రత్, గోవర్ధనలు తెలిపారు. స్థానిక ఎంఆర్ పల్లి లోని ఆ కళాశాల ప్రాంగణంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్ ఫలితాలలో తమ విద్యార్థులు పి.నిఖిల్ 253, కె.యశశ్రీ 3089, ఎం.మౌనిష 3110, బి.సిద్ధార్థ 4113, సివి రేవంత్ 4600, జి.వెంకటరెడ్డి 6624, 40 మంది విద్యార్థులకు గాను 18 మందికి పైగా జేఈఈ అడ్వాన్స్‌కు క్వాలిఫై అయినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్స్ సుమతి, రామయ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

శ్రీవారి సేవలో నటి సమంత

ప్రజాశక్తి -తిరుమల: టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శుక్రవారం తిరుమల చేరుకున్న ఆమెకు టీటీడీ ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆమె క్రిష్టియన్ కావడంతో టీటీడీ డిక్లరేషన్‌పై సంతకం చేశారు. అనంతరం సమంత స్వామివారి మొక్కులు చెల్లించుకున్నారు.

తిరుమలలో శరభయ్య పీఠం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) తిరుమలలో సన్నిధి గొల్ల శరభయ్య యాదవ్ విగ్రహాన్ని, శరభయ్య పీఠం ఏర్పాటు చేయాలని వాసుదేవ యాదవ సేవా సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి హేమంత్ కుమార్ యాదవ్, సన్నిధి కిషోర్ యాదవ్, ఉపాధ్యక్షులు కట్టా జయరామ్ యాదవ్ మాట్లాడారు. తిరుమల శ్రీవారిని దర్శించుకునే సన్నిధి గొల్లకి మొదటి దర్శన భాగ్యం తప్ప మరే ఆదరణ లభించలేదని, భారతదేశవ్యాప్తంగా ఉన్న యాదవుల చిరకాల కోరికను ఇటీవల యాదవ సంక్షేమం, అభివద్ధి కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన మొదటి సమావేశంలో తిరుమలలో శరభయ్య విగ్రహం ఏర్పాటు, శరభయ్య పీఠంకు స్థలం అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి తీర్మానం చేసి పంపడం జరిగిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సంఘం కోశాధికారి రామచంద్ర యాదవ్, ముని మేఘనాదం, కుడితి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చింతామోహన్ క్షమాపణ చెప్పాలి: గౌతమ్ కుమార్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) కాన్షీరామ్ దయతో కేంద్రంలో మనుగడ కొనసాగించిన చింతా మోహన్ ఆయనను సముచిత గౌరవం ఇవ్వకుండా ప్రెస్ మీట్‌లో సంబోధించడాన్నీ ఖండిస్తున్నామని, వెంటనే ఆయన బహుజన సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని బిఎస్పి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్ డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశ్రాంత న్యాయ మూర్తి గుర్రప్ప తో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ప్రభాకర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

6న బీసీల ఆత్మగౌరవ సభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) తిరుపతి వేదికగా జూన్ 6వ తేదీన బీసీల హక్కుల సాధనకై బీసీల ఆత్మగౌరవ సభను నిర్వహించ తలపెట్టామని, ఈ సభకు యావత్తు బీసీలు తరలివచ్చి విజయవంతం చేద్దామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని ప్రైవేట్ హోటల్లో బీసీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేశన శంకరరావు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడానికి బీసీ సంఘం తగిన మద్దతును ఇచ్చిందన్నారు. నేడు కొంతమంది బీసీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, దీనిని ఖండిస్తున్నామన్నారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ, జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీలకు స్థానం కల్పించాలని దీర్ఘకాలికంగా పోరాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కల్లూరు నాగరాజు గౌడ్, దక్షిణాది రాష్ట్రాల బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆల్మేన్ రాజు పాల్గొన్నారు.

టిటిడిలో అన్యమతస్తులపై చర్యలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో అన్యమతస్తులపై చర్యలు ప్రారంభమయ్యాయి. బదిలీచేస్తూ తొలి ఉత్తర్వులను టిటిడి జారీ చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం, టీటీడీలో అన్యమతస్తులు లేకుండా చూస్తామని ఇటీవల సీఎం చంద్రబాబు చెప్పారు. అందులో భాగంగా చర్యలు మొదలయ్యాయి. ఉద్యోగుల వివరాలు చెక్ చేసి బదిలీ పర్వం మొదలుపెట్టింది. వారిని వేరే శాఖలకు బదిలీ చేసే ప్రక్రియ మొదలైంది.

సంస్కృత భాష వైభవాన్ని చాటిచెబుదాం

ప్రజాశక్తి - క్యాంపస్: సంస్కృత భాష వైభవాన్ని చాటి చెప్పాలని వక్తలు ఉద్ఘాటించారు. తిరుపతి సంస్కృత విద్యాపీఠంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు సంస్కృత భారతి పూర్వకాలిక సమావేశం జరిగింది. ఎస్పి హర్షవర్ధన్‌రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్పి మాట్లాడుతూ సంస్కృత వైభవాన్ని తీసుకొచ్చేందుకు చేస్తున్న కృషి మరువలేమన్నారు. ఈ విద్యాలయం 2 లక్షల మంది అధ్యాపకులు తయారు చేయడం శుభపరిణామన్నారు.

ఆయనంతే..! కదలడు.. వదలడు



- శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆగడాలు
- కార్మికులపై కక్ష సాధింపు చర్యలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్: తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపాలిటీలో గత తొమ్మిది సంవత్సరముల నుండి నిబంధనలకు విరుద్ధంగా శానిటరీ ఇన్స్పెక్టర్‌గా రామారావు విధులు నిర్వహిస్తున్నారు. రాజకీయ పలుకుబడితో వెంకటగిరిలోనే తిష్టవేసి, అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ఎవరు అధికారంలో ఉంటే వారికి అడుగులకి మడుగులొత్తుతు తను చేసే అవినీతి పనులకు ఎవరు అడ్డు రాకుండా మేనేజ్ చేసుకుంటూ ఉన్నారు. శాఖకు సంబంధించి ఎవరు ఆర్టిఐ కింద సమాచారంకోసం పెట్టినా కూడా ఎక్కడ వారి అవినీతి, అక్రమాలు బయటపడిపోతాయని భయంతో సమాచారం ఇవ్వడం లేదు. ఇచ్చినా తప్పుడు సమాచారం ఇస్తున్నారు. వేరే మున్సిపాలిటీకి ట్రాన్స్ఫర్ అయినా కూడా మళ్లీ తన రాజకీయ పలుకుబడి. ధన బలంతో వెంకటగిరికే ఎందుకు శానిటరీ ఇన్స్పెక్టర్‌గా వేయించుకొని వస్తున్నారు అని స్థానికంగా ప్రజలు చర్చించుకుంటున్నారు.

వెహికల్స్‌లో అవినీతి

కొన్ని సంవత్సరాలుగా రిపేరులో ఉన్న వెహికల్స్, అవి కూడా తిరుగుతూ ఉన్నట్టుగా, రిపేర్లు వచ్చినట్లుగాను, వాటికి రిపేరు చేయించినట్లుగాను, బిల్లులు పెట్టుకోవడం ఆయిల్ పట్టించినట్లు బిల్లులు పెట్టుకోవడం వంటి వాటితో తన చేతివాటం చూపిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. రెండు సంవత్సరాలుగా రిపేరులో ఉన్న లారీ పనిలో ఉన్నట్లు, రిపేర్లు చేయించినట్లు బిల్లులు పెట్టారని విమర్శలున్నాయి. ఒక ట్రాక్టర్, 3 ఆటోలు, రెండు సంవత్సరముల నుండి రిపేర్‌లో ఉన్నాయి. వీటిని రిపేరు చేయించి చెత్త తరలించే పని చేయడం లేదు.

మున్సిపల్ కార్మికులపై శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు నిత్యం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. అడిగితే దిక్కున చోట చెప్పుకో అని మాట్లాడుతున్నారు. ఒక అధికారిగా ఉండి యూనియన్ విషయాల్లో జోక్యం చేసుకుంటూ నా యూనియన్‌లో ఉండండి, మీరు మస్టర్‌కి వచ్చిన రాకపోయినా మస్టర్లు వేస్తాను, డ్యూటీలకు రాకపోయినా ఫుల్ మస్టర్ వేసి జీతం తగ్గకుండా చేస్తాను అని చెప్తూ ఉన్నారు. సిఐటియు యూనియన్‌లో ఉండొద్దు అనే కార్మికులను హెచ్చరిస్తున్నారు. ఇతనిపై కొంతమంది కార్మికులు తిరగబడి మాట్లాడారు. మాకు నచ్చిన యూనియన్‌లో మేము ఉంటాము సిఐటియుని వదలము యూనియన్ గురించి చెప్పే దానికి మీరెవరు అని కార్మికులు చెప్పడం జరిగింది. ఈ విధంగా అతని మాట వినకుండా సీఐటీయూ లోనే ఉన్న కార్మికుల్ని ఇబ్బందులకు గురి చేస్తూ ఉన్నారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. మస్టర్‌కి వచ్చి విధుల్లో ఉంటున్న కూడా ఆబ్‌సెంట్ వేసి జీతాల్లో కోత పెడుతున్నారు.

ఇదేవిధంగా మరో ఉద్యోగి షౌకత్ ఆలీ కూడా నిబంధనలకు విరుద్ధంగా గత ఏడు సంవత్సరముల నుండి రాజకీయ పలుకుబడుతూ వెంకటగిరిలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. అక్రమ పద్ధతిలో వెంకటగిరిలోనే తిష్ట వేసి అవినీతి అక్రమాలకు పాల్పడుతూ గత తొమ్మిది సంవత్సరముల నుండి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రామారావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న, దుర్వినియోగం చేస్తున్న రామారావుని వెంటనే సస్పెండ్ చేయాలని ఎక్కడ నుండి బదిలీ చేయాలని పట్టణ ప్రజలు ప్రజా సంఘాల వారు డిమాండ్ చేస్తూ ఉన్నారు.

కార్మికుల వివరణ

సిఐటియు యూనియన్‌లో సభ్యులుగా ఉన్నటువంటి మున్సిపల్ కార్మికులకి నెల నెల జీతాలు తగ్గిస్తున్నారు. ప్రతిరోజు పనులకు వస్తున్న కూడా జీతాల్లో కోత విధిస్తున్నారు. అడిగితే నా యూనియన్‌లో ఉండండి అని అంటున్నారు. పి రమణయ్య, శేఖర్ సుబ్రమణ్యం, పెంచలయ్య, ఇంద్రమ్మ తదితర లీడర్స్ మీద కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూనే ఉన్నారు.

క్రైం న్యూస్

గూడ్స్ రైలు ఢీకొని 10 గేదెలు మృతి

ప్రజాశక్తి - బాలాయపల్లి : నిడిగల్లు - వెండోడు మధ్య, రేణిగుంట నుండి గూడూరు వైపు వెళుతున్న గూడ్స్ రైలు ట్రాక్ పైకి వచ్చిన గేదెలను ఢీకొనింది. ఈ ప్రమాదంలో 10 గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక గూడ్స్ వ్యాగిన్ చక్రం పట్టా తప్పింది. గేదెలు ఢీకొనడంతోనే గూడ్స్ బోగి పట్టాలు తప్పిందని రైల్వే అధికారులు తెలియపరిచారు. ఈ ప్రమాదం శుక్రవారం ఆర్ధరాత్రిపైన రెండు రెండున్నర గంటల సమయంలో జరిగిందని తెలిపారు. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని ఉదయం 6 గంటలకల్లా రూట్ క్లియర్ చేశారు.

నగదుతో పరారైన పోస్ట్ మెన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రజల సొమ్ముతో ఓ పోస్ట్ మెన్ పరారైన సంఘటన శనివారం ఆలస్యంగా తొట్టంబేడు మండలం చిట్టతూరులో వెలుగు చూసింది. వివరాల్లోకి పోతే శ్రీకాళహస్తి పట్టణం భాస్కరపేటకు చెందిన చైతన్య చిత్తూరు బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలో పోస్ట్ మెన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. అయితే చైతన్య గత 15వ తేదీ నుంచి అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు డుమ్మా కొట్టాడు. దీంతో విచారణ మొదలుపెట్టిన పోస్టల్ అధికారులు చైతన్య కోనూరు ఎస్ వోకి చేరాల్సిన సుమారు రూ. 2 లక్షల సొమ్ముతో పరారైనట్లుగా గుర్తించారు. ఇదిలా ఉండగా చైతన్య ఇంటి నుంచి అదృశ్యమైనట్లుగా ఈనెల 17న టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బంధువులు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఈ విషయంపై శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ బాలాజీని వివరణ కోరగా పోస్ట్ మెన్ చైతన్య ప్రజల సొమ్ముతో పరారైన సంగతి వాస్తవమేనని వివరించారు. విచారణ చేపడుతున్నట్లు తెలియజేశారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీధర్స్ అకాడమీ ప్రభంజనం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, ఎఐఆర్ బైపాస్ రోడ్‌లోని శ్రీధర్ అకాడమీ విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాలలలో జాతీయ స్థాయిలో వివిధ కేటగిరిలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలియచేశారు. కళాశాల ప్రాంగణంలో శనివారం అయిన విలేకరులతో మాట్లాడుతూ తమ విద్యార్థులు యమ్. మహేష్ 298 ర్యాంకును, యస్. వంశీ కృష్ణ రెడ్డి 756 ర్యాంకును, టి. హరజిత్ 1477 ర్యాంకును, టి.నికేలేశ్వర్ రెడ్డి 4260 ర్యాంకును, ఇ.మంజూశ్రీ 6103 ర్యాంకును, పి.మహ్మద్ అబుతాలిబ్ 7843 ర్యాంకును, యస్. మహ్మద్ ఇమ్రాన్ 8240ర్యాంకును, డి.పోషిత 15891 ర్యాంకులను సాధించారని అలాగే జేఈఈ మెయిన్స్ పరీక్షకు 108 మంది విద్యార్థులు హజరుకాగా జే ఈఈ అడ్వాన్స్డ్ పరీక్షకు 42 మంది విద్యార్థిని, విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఈ ప్రతిభ చూపిన విద్యార్థినీ, విద్యార్థులను చైర్మన్ మద్దినేని శ్రీధర్, అధ్యాపక బృందము అభినందించారు. తమ సంస్థ పాటిస్తున్న అత్యుత్తమ విద్యాప్రమణాలతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన తలిపారు.

శివయ్య సేవలో సమంత



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సినీనటి సమంత శనివారం శ్రీకాళహస్తీ శ్వరాలయానికి విచ్చేశారు. ఆమెకు ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రాహు కేతు పూజల అనంతరం స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. తన నిర్మాతగా మారి మొదటిగా నిర్మించిన శుభం చిత్రం విజయవంతం కావాలని శివుని వేడుకున్నట్లు సమంత తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాల కృష్ణ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో జరుగు తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర పరిశుభ్రతా కార్యక్రమాన్ని పరిశీలించారు.

మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : తిరుపతి, బి.టి.ఆర్ కాలనీ, అన్నమయ్య కళాక్షేత్రంలో శనివారం ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జడపల్లి పార్వతమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని నెల్లూరులో జూన్ 7,8 తేదీల్లో జరుగు ఏ.పి.వడ్డెర వృత్తిదారుల సంఘం ప్రథమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు చల్లా చిన్నవెంకటయ్య పసుపులేటి బాబు, జిల్లా గౌరవ సలహాదారులు చల్లా వెంకటయ్య, జిల్లా నాయకులు కుంచపు రమణయ్య, కుంచపు శ్రీరాములు, పసుపులేటి గణేష్, పసుపులేటి గంగా దేవి, గోగుల లత గోవుల రాజి, సూర జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్టైఫండ్ ఇవ్వడం ఆనందదాయకం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయులో ఎటువంటి ఫెలోషిప్స్ లేకుండా పరిశోధనలు చేస్తున్న విద్యార్థులకు నెలకు 3000 రూపాయలు మంజూరు చేయడం శుభ పరిణామని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉపకులపతి ఆచార్య అప్పారావును ఘనంగా సన్మానించారు. విసీని సన్మానించిన వారిలో పవన్ కుమార్ యాదవ్, మహేష్ ,రమేష్, మోహన్ కృష్ణ, గోపాల్ ,విష్ణు తదితరులు ఉన్నారు.

మూర్తీభవించిన తెలుగు సాహిత్యం సర్వోత్తమరావు

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు తెలుగు అధ్యయన శాఖలో ఆచార్యులుగా పదవీ విరమణ పొంది 25 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఆచార్య కె.సర్వోత్తమరావు సన్మాన కార్యక్రమం యస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో శనివారం తెలుగు అధ్యయన శాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ సర్వోత్తమరావు మూర్తీభవించిన తెలుగు సాహిత్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పలువురు రచయితలు భాషా సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

గీతా పఠనంతో మానసిక ఒత్తిడి దూరం

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులకు గీతా పఠనంతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని నిత్యముక్తదాస్ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ భువనేశ్వరి అధ్యక్షతన తిరుపతి అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం వారు ఆధ్యాత్మిక ప్రేరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి భాధ్యత

- ఘనంగా స్వర్ణాంధ్ర .. స్వచ్ఛాంధ్ర
- రోడ్లపై వ్యర్థాలు వేయరాదు
- ఈ-వేస్ట్‌ను మున్సిపాలిటీవారికి అందించండి







రామచంద్రాపురంలో చెత్తసేకరణ వాహనంలో చెత్త పోస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఎమ్మెల్యే నాని, గూడూరులో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పాశిం సునిల్ కుమార్, పుతుత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పులివర్తి నాని అన్నారు. నేటి విద్యార్థులు స్వచ్ఛస్వర్ణ ఆంధ్ర ప్రచార వారధులని తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. చంద్రగిరి పట్టణంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాని, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛందంగా చంద్రగిరి ఏరియా ఆసుపత్రిలో ఎలక్ట్రిక్ వస్తువుల వ్యర్థాలను ఎస్పీ హర్షవర్ధన రాజు ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి సేకరించి వాహనంలో వేశారు. టవర్ క్లాక్ ముందు విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి బొడ్డు హేమంత్, తాశీల్దార్ శివరాం సుబ్బయ్య, ఇన్చార్జ్ ఎంపీడీవో వెంకటరత్నం నాయుడు, సర్పంచ్ ముదికుప్పం రూప రామమూర్తి ఏఎంసి చైర్మన్ గౌస్ బాషా, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జెడ్పిటిసి రమేష్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు అత్తూరు తులసీశ్వర్ రెడ్డి, ఏజిపల్లి బాల , మోహన్ రెడ్డి, గ్యాస్ నాగరాజు,ఎస్సీ సెల్ వేణు, రామారావు బిసిరిపాటి శంకర్ ,మంగాపురం భాస్కర్ ,బాలసుబ్రమణ్యం,సింగు సుధా ,కొత్తపల్లి సునీత, సక్కూరు ధనంజయ రెడ్డి, ప్రవీణ్, బీసీ సెల్ మనీ యాదవ్, సునీల్ కుమార్ నాయుడు,మండీ రావు, బిజెపి వెంకట ముని, జనసేన తాపసి మురళీకృష్ణ రెడ్డి, పెద్ద ఎత్తున మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రతినిత్యం అనేక ఎలక్ట్రికల్ వస్తువులు వాడుతూ ఉంటామని అవి చెడిపోయిన తర్వాత ఎక్కడంటే అక్కడ వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని ఈ వేస్ట్ వల్ల పర్యావరణం కలుషితం అవుతుందని ప్రజలందరూ సహకరించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కోరారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ వేస్ట్ వ్యర్థాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డి.ఎస్.పి గీతా హాజరయ్యారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు మేమేంటోలు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ వేస్ట్‌పై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తాసిల్దార్ చంద్రశేఖర్, నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రహీం, మస్తాన్ నాయుడు, శ్రీనివాసులు రెడ్డి, లీలావతి, భారతి, జలీల్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఏప్రిల్ నెల మూడవ శనివారం ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ అనే ప్రధాన అంశంతో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరులో, ఎన్.ఎస్.ఎస్. విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఈవారం ఈ వేస్ట్ సేకరణ (ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ) ప్రధానాంశమని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతను పాటించే విషయంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని వక్తలు కోరారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సభలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కే.శ్రీనివాసులు, వి. బాబురావు, వైస్ ప్రిన్సిపాల్ వి.వీరయ్య: ఇతర అధ్యాపకులు డాక్టర్ పి. సుజనా, డాక్టర్ సి. వెంకట కృష్ణయ్య, డాక్టర్ ఏ.దేవకి, డాక్టర్ వి.వాసవి, ఆర్జా నాగేశ్వరరావు, డాక్టర్ జి.తిరుమలయ్య, డాక్టర్ జి.గంగయ్య, డాక్టర్ పి.వెంకటేశం, డాక్టర్ జై.కోటేశ్వరరావు, డాక్టర్.వసంత్, డాక్టర్ షర్మిల, శ్రీమతి ఎస్.పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: శనివారం ఉదయం డివై ఈవో పుత్తూరు ఆధ్వర్యంలో పల్లమాల జిల్లా పరిషత్లో పాఠశాల మరియు బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీదేవి మండలవిద్యాశాఖ అధికారులు, రవీంద్రనాథ్ మునుసుబ్రహ్మణ్యం, ఎంపీడీవో త్రివిక్రమ రావు, సర్పంచులు గోపాల్ రెడ్డి, వెంకటమ్మ, పంచాయితీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, సచివాలయం ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ శాఖ వసతి గృహంలో..

శనివారం ఉదయం తిరుపతి జిల్లా బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ వసతి గృహాధికారి రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిధిగా బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది హైమావతి చంగయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పిచ్చాటూరు: శనివారం సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి ఆధ్వర్యంలో పిచ్చాటూరులో విద్యార్థులతో కలిసి స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మన అందరి భాధ్యత అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీదేవి, పంచాయితీ కార్యదర్శి ప్రకాశ్, రిటైర్డ్ హెచ్ఎం రామలింగం, సచివాలయం ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం: సమాజంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎంపీడీవో ఇందిరమ్మ, డిప్యూటీ తహసిల్దార్ అన్వర్ భాషలు అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ దివాస్ చేపట్టి పరిసరాలు, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రం చేశారు. అనంతరం ఎంపీడీవో, తహసిల్దార్ కార్యాలయం నుండి విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఈ వేస్ట్ పై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు పి చంద్రశేఖర్ రెడ్డి, సురేష్, సంజీవరెడ్డి, ఏపీవో సుజాత, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ మహేష్, వీఆర్వోలు బాబు, ఝాన్సీ, రాజశేఖర్, నరసింహులు, వెంకటరమణ, మల్లికార్జున్, గుణ భూషణ్ నాయుడు, జూనియర్ అసిస్టెంట్ వంశీ, కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రవణం స్కూల్ 18వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: తిరుపతిలో టిటిడి వారిచే నిర్వహించబడుతున్న శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఫర్ చిల్డ్రన్ విత్ హియరింగ్ ఇంపార్మెంట్ "శ్రవణం" స్కూల్ 18వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్ రాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సంవత్సరం రిలీవ్ అవుతున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ భాను ప్రకాష్, డెమ్ అండ్ డఫ్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ రమణమూర్తి, టీటీడీ బాల మందిర్ ఏఈఓ అమ్ములు, శ్రవణం స్కూల్ ప్రెసిడెంట్ కనకదుర్గ, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

బాలల వసతి గృహాల పరిశీలన




ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలో నిర్వహించబడుతున్న బాలుర, బాలికల ప్రత్యేక వసతి గృహాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, కమిషన్ సభ్యులు గొండు సీతారాం, కుమారి ఆదిలక్ష్మి త్రిపర్ణ, జంగం రాజేంద్ర ప్రసాద్, బత్తుల పద్మావతిలు ఆకస్మికంగా పరిశీలించారు. అక్కడి పిల్లలతో భేటీ అయ్యారు. తరుచుగా వైద్య పరీక్షల నిర్వహణ చేయాలనీ, అన్నదికార వ్యక్తులును అనుమతించరాధాని తెలిపారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. బాల బాలికలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు ఎం.శరత్ బాబు, డా జయశ్రీ, డిప్యూటీ సూపరింటెంట్ వి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జీ తెలుగులో 'మజాకా' సినిమా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించడంలో ఎప్పుడూ ముందుండే జీ తెలుగు ఈ ఆదివారం మరో సూపర్ హిట్ సినిమాతో వచ్చేస్తోంది. సందీప్ కిషన్, రీతూ వర్మ, రావు రమేష్, అన్షు సాగర్ ప్రధాన పాత్రల్లో నటించిన 'మజాకా' సినిమాని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందిస్తోంది. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన కామెడీ ఎంటర్టైనర్ 'మజాకా' ఈ ఆదివారం(ఏప్రిల్ 20) సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో. ఈ సినిమాలోని హదయాలను హత్తుకునే సన్నివేశాలు, భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి.

ఉపాధ్యాయులకు ఆదర్శం మునిశేఖర్



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ : పెళ్లకూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శెట్టిపల్లి మునిశేఖర్ పదవీ విరమణ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు వివిధ మండలాల మండల విద్యాశాఖ అధికా రులు కార్యక్రమానికి హాజరై మునిశేఖర్‌కు శుభాకాంక్షలు తెలి పారు. ఆయన సేవలను మండల విద్యాశాఖ అధికారులు కొని యాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు శంకరయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు, బంధుమిత్రులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

ప్రజాశక్తి - రామచంద్రపురం : అంగన్వాడిలో చదివిన పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించే విధంగా చూడాలని రామచంద్రాపురం మండల ఎంపీడీవో ఇందిరమ్మ, ఎంఈఓ మార్కండేయ నాయుడులు సూచించారు. శనివారం అంగన్వాడీ సిబ్బందితో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మార్కండేయ నాయుడు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో కూడా తెలుగు ఇంగ్లీష్ మీడియాలలో విద్యాబోధన అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈ ఓ 2 జయవేలు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రేవతి, పావని, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాల్ హరీస్ జయంతి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రోటరీ క్లబ్ ఆధర్యంలో స్థానిక ఎఎఆర్ రోటరీ భవనంలో శనివారం రోటరీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రోటరీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు స్వర్గీయ రోటేరియన్ పాల్ హరీస్ జయంతి వేడుకలు నిర్వహించారు. రోటేరియన్స్ ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అనంతరం శివ రామిరెడ్డి దాతృత్వంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రెండు వాటర్ కూలర్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి జి.జి.నాయుడు, పిడీజి మునిగిరీష్, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ బి.దశరథరామిరెడ్డి, మయూరి శ్యామ్ యాదవ్, రోటేరియన్స్ రఘురామిరెడ్డి, బాలకృష్ణ రాజు, కిరణ్ చక్రవర్తి, రవీంద్ర రెడ్డి, రాంప్రసాద్, సురేష్, రవికుమార్, పి.కృష్ణ,బలరాం రెడ్డి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారం ఎంతో ప్రాధాన్యం

ప్రజాశక్తి -కోట : కోట మండల కేంద్రంలోని తిన్నెలపూడి అంగన్వాడి కేంద్రంలో 1000 రోజుల ప్రాముఖ్యతను గర్భవతులకు, బాలింతలకు, నెల నుంచి రెండు సంవత్సరాల పిల్లల తల్లులకు ఐసీడీఎస్ సిడిపిఓ ముని కుమారి తెలియజేశారు. ఈ సందర్భంగా శనివారం సిడిపిఓ మునికు మారి మాట్లాడుతూ పోషణ పక్వాడ ప్రోగ్రాం ఏప్రిల్ 8వ తేదీ నుండి 22 వరకు నిర్వహించబడుతుందన్నారు. అంగన్వాడి సూపర్వైజర్ కృష్ణమ్మ పోషకాహారం ప్రాధాన్యత వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ మునికుమారి సూపర్వైజర్ ఐ.క్రిష్ణమ్మ, అంగన్వా టీచర్ మాదవి, శశి, సుజాత, ముత్యాల మ్మ, ఎమ్ ఎల్ హెచ్ పీ భార్గవి,పిల్లల తల్లులు పాల్గొన్నారు.

గోవిందధామాన్ని త్వరగా పూర్తి చేయండి



ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరిలో శ్రీనివాస మంగాపురానికి వెళ్లే రహదారి పక్కన నిర్మిస్తున్న గోవింద ధామాన్ని త్వరితగతున్న పూర్తి చేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే నాని సూచించారు. శనివారం గోవింద ధామం నిర్మాణ పనులను కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. గోవిందధామం నిర్మాణానికి దాతలు విరాళాలు ఇవ్వడానికి ముందుకు రావాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ మురళి, ఇంచార్జ్ ఎంపీడీవో వెంకటాద్రి నాయుడు, తహసిల్దార్ శివరాం సుబ్బయ్య, నాయకులు మునిరత్నం రాయల్, వి రమేష్ రెడ్డి. వి సుబ్రహ్మణ్యం నాయుడు, ఎస్ గౌస్ బాషా, బాలకృష్ణమూర్తి, లోకాద్రి నాయుడు, రామారావు, అధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు రూరల్ మండలం, అన్నా గౌరీ హాస్పిటల్‌లో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తూరు అగ్నిమాపక కేంద్ర అధికారి నేతాజి మాట్లాడుతూ వంట ఇంటిలో గ్యాస్ లీక్ అవుతున్నప్పుడు డీజిల్, పెట్రోల్ అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచకూడదని సూచించారు.